క్లుప్తంగా

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

గూడూరు: మల్లవోలులో రూ.12 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ బుధవారం శంకుస్థాపన చేశారు. మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్, పార్టీ నాయకులు పోతన స్వామి, కిషన్‌తేజ్, ప్రత్తిపాటి శ్రీనివాసరావు, గోపి నాగబాబు, కూనపరెడ్డి పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆలయ ఏసీ

మోపిదేవి: మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నూతన డెప్యూటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన దాసరి శ్రీరామ వరప్రసాదరావు బుధవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. పూలదండలు వేసి స్వామివారి ప్రసాదం లడ్డూను అందజేశారు. వీరివెంట ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన ఉండాలి

పెడన: తడి, పొడి చెత్తపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త కటకం ప్రసాద్ అన్నారు. బుధవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత హీ సేవ–2024 కార్యక్రమమంలో భాగంగా 17వ వార్డు పోలవరపుపేటలో తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు, వార్డు కౌన్సిలర్ మెట్ల గోపీ ప్రసాద్, పురపాలక, సచివాలయ, మెప్మా సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తికేయునికి వెండి వస్తువుల సమర్పణ

మోపిదేవి: స్థానిక మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి ఖమ్మం వాస్తవ్యులు ఎన్నాకుల వెంకట రాఘవేంద్రమణికంఠ రూ.20 వేల విలువైన 210 గ్రాముల వెండి వస్తువులను బుధవారం సమర్పించుకున్నారు. ఉదయం స్వామివార్లను దర్శించుకున్న అనంతరం వెండి గిన్నె, వెండి ఉద్ధరిణి, వెండి మారేడు దళం దండ, వస్తువులు ఆలయ ఏసీ శ్రీరామ వరప్రసాదరావుకు అందించారు. ఆలయ మర్యాదలతో దాత కుటుంబ సభ్యులను సత్కరించారు.

సినీ సంగీతాన్ని సుసంపన్నం చేసిన బాలు

అవనిగడ్డ: సినీగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సినీ సంగీతాన్ని సుసంపన్నం చేసిన గొప్పవ్యక్తి అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి నిర్వహించారు. బాలు చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా), ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, గాంధీక్షేత్రం కమిటీ చైర్మన్ మత్తి శ్రీనివాసరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణరావు,నేతలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడిగా శేఖర్

మచిలీపట్నంటౌన్: ఆర్యవైశ్య సంఘం మచిలీపట్నం మండల అధ్యక్షుడిగా నగరానికి చెందిన పద్మనాభుని నరసింహమూర్తిని (శేఖర్) నియమించారు. బుధవారం జరిగిన ఆర్యవైశ్య సంఘం జిల్లా సమావేశంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు సాయిశ్రీనివాస్ ఈ మేరకు శేఖర్ నియామక పత్రాలను అందజేశారు. శేఖర్‌ను జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి వేముల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వేముల కృష్ణ, చీఫ్ ఆర్గనైజర్ మానేపల్లి రఘురాం, రాజకీయ కమిటీ చైర్మన్ జల్లూరు ప్రసాద్ తదితరులు సత్కరించి అభినందించారు.

మహిళా చేనేత సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలి

పెడన: మహిళా సభ్యులతో ప్రత్యేకంగా చేనేత సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా(ఏఐడబ్ల్యూఎఫ్) వీవర్స్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా శాఖ అధ్యక్షుడు పిచ్చుక ఫణికుమార్ బుధవారం చేనేత, జౌళి శాఖ కృష్ణా జిల్లా సహాయ సంచాలకులు సీహెచ్ సాయిప్రసాద్‌ను కోరారు. నూతనంగా జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టిన సాయిప్రసాద్‌ను ఏఐడబ్ల్యూఎఫ్ సభ్యులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు అనుమతించిన సందర్భంగా పెడన పట్టణంలో ప్రత్యేకంగా మహిళల కోసం సంఘం ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. ఏడీని కలిసిన వారిలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఆకురాతి జనార్దన్, గౌరవ అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు, సంయుక్త కార్యదర్శి వుమ్మిటి శ్రీను, బళ్ల సాంబశివరావు ఉన్నారు.

ఈకేవైసీ చేస్తేనే పరిహారం

బంటుమిల్లి: సార్వ సాగు చేసిన రైతులు పంటలను ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారమైన అందుతుందని ఎంఏవో జి.శివరామకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని కంచడం, బంటుమిల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పంట పొలాలు పరిశీలించారు. పశువైద్యులు ప్రసాదు, వీసీఏలు, రైతులు పాల్గొన్నారు.

రైతుల జాబితా మార్పు .. మతలబేంటి బాబూ?

- భారీ వర్షాలకు 5,065 ఎకరాల ముంపు
- 4,336 మంది రైతులు నష్టపోయారంటూ నివేదికలు
- ఆర్ఎస్‌కేలలో తూతూ మంత్రంగా నష్టపోయిన రైతుల పేర్లు ప్రదర్శన
- ప్రాథమిక అంచనాలకు..తుది నివేదికలకు అందనంత వ్యత్యాసం
- ప్రకృతి చేసిన గాయంపై ప్రభుత్వం కారం చల్లుతుందంటున్న రైతులు


భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలు (ఫైల్)



పెడన మండలం పెనుమల్లి రైతు సేవా కేంద్రం

పెడన: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు పంట నష్టపోయి మళ్లీ వేయడానికి వీల్లేని దుస్థితిలో రైతులు ఇప్పటికీ కొట్టుమిట్టాడుతున్నారు. దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ సాయమైన కొంత ఊరట కలిగిస్తుందనే ఆశతో ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వ తీరు బాధిత రైతులను మరింత కుంగదీసేదిగా ఉంది.

ఇంత వ్యత్యాసం ఎందుకో..

ఎన్డీయే కూటమి ప్రభుత్వం నష్టపోయిన రైతుల జాబితాలను సిద్ధం చేసేందుకు ఆదేశించింది. ఇందుకోసం వ్యవసాయశాఖ గ్రామ వ్యవసాయశాఖ సహాయకులను (వీఏఏ), ఎంపీఈవోలను క్షేత్రస్థాయిలో పంపించి ఎక్కడైతే పంట నష్టపోయారో వారి పేర్లను నమోదు చేసి జాబితాలను సిద్ధం చేయాల్సిందిగా పేర్కొనడంతో తొలుత ప్రాథమిక నివేదికలు పంపించారు. అయితే తుది నివేదిక చూసి రైతులు విస్తుపోతున్నారు. అంచనాలు దగ్గర దగ్గరగా ఉంటాయని, ఇంత వ్యత్యాసం ఎందుకుందని ప్రశ్నిస్తున్నారు.

జాబితాలో ఇంత వ్యత్యాసమా..?

ప్రాథమిక అంచనాలు వేయడంలో వ్యవసాయశాఖ సరిగ్గా పనిచేయలేదా, లేక మరేదైనా జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కారణం గూడూరు మండలంలో ప్రాథమిక అంచనాలో 4,625 ఎకరాల్లో పంట నష్టపోయిందని రిపోర్టు ఇచ్చారు. అయితే తుది నివేదికలో 1,087 ఎకరాలు మాత్రమేనని పేర్కొనడం విశేషం. ఒకేసారి అధికంగా చూపించేసి ఆ తరువాత మరీ తక్కువగా చూపించడం వెనుక మతలబు ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఇక పెడన మండలంలో 600 ఎకరాలను ప్రాథమిక అంచనాలో చూపి, తుది నివేదికలు 1,916 ఎకరాలని చూపించడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల పరిస్థితి మెరుగ్గానే ఉంది. ప్రాథమిక అంచనాలు బంటుమిల్లిలో 1,250 ఎకరాలు నష్టపోయి ఉండవచ్చని పేర్కొనగా తుది నివేదికలో 1,462 ఎకరాలు దగ్గరగానే ఉంది. కృత్తివెన్నులో వెయ్యి ఎకరాలు నష్టపోయి ఉంటుందని ప్రాథమిక రిపోర్టు ఇవ్వగా తుది నివేదికలో 597 ఎకరాలు నష్టపోయినట్లు పేర్కొన్నారు. పెడన మండలం చెన్నూరు, బంటుమిల్లి మండలం ముంజులూరు తదితర సచివాలయాల్లో పంట నష్టపోని వారి పేర్లు జాబితాలో ఉన్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తూతూ మంత్రంగా జాబితాల ప్రదర్శన..

పంట నష్టపోయిన రైతుల జాబితాలను ఈ నెల 10వ తేదీన రైతు సేవా(ఆర్ఎస్‌కే) కేంద్రాల్లో ప్రదర్శించాల్సిందిగా వ్యవసాయశాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంకా జాబితాలను సిద్ధం చేయలేదని క్షేత్రస్థాయి నుంచి నివేదికలు వెళ్లడంతో పాటు తీవ్ర స్థాయిలో తమ్ముళ్ల ఒత్తిళ్లు అధికంగా ఉండటం జాబితాలను ప్రదర్శించలేదు. ఎట్టకేలకు నివేదికలను పైకి పంపించేసిన తరువాత ఆర్ఎస్‌కేలలో ప్రదర్శించారు. వాటిపై అభ్యంతరాలున్నా ఏమీ చేయలేని పరిస్థితి. ఈ విధంగా జాబితాలను ప్రదర్శించి నష్టపోని వారి పేర్లను జాబితాలలో చేర్పించారనే విషయానికి బలం చేకూరుతుంది.

5,065 ఎకరాల్లో నష్టం..రూ.5.06కోట్లు

పెడన నియోజకవర్గంలో 5,065 ఎకరాలు 33 శాతం కంటే నష్టపోయారని పేర్కొంటూ ఎకరానికి రూ.10 వేల చొప్పున మంజూరు చేయాలని నివేదికలను పంపించారు. పెడనలో 1,916 ఎకరాలకు సంబంధించి 1,743 మంది రైతులున్నారని, రూ.1.91,60,000, బంటుమిల్లిలో 1,463 ఎకరాలకు 1,069 మంది రైతులకు రూ.1,46,30,000, గూడూరు 1,088 ఎకరాలకు 1,081 మంది రైతులకు రూ.1,08,80,000, కృత్తివెన్ను మండలంలో 597 ఎకరాలకు 443 మంది రైతులకు నష్టపరిహారం కింద రూ.59,70,000 ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంటూ నివేదికలను అధికారులకు పంపించారు.

> **ఆర్ఎస్‌కేలలో రైతుల జాబితాలున్నాయి**
>
> నష్టపోయిన రైతుల పేర్లను రైతు సేవా కేంద్రాల్లో ఉంచాం. ఈ నెల 10వ తేదీన పెట్టాల్సి ఉంది. అయితే క్షేత్రస్థాయి నుంచి నివేదికలు అందడంలో జాప్యం నెలకొనడం వల్ల ఈ నెల 13వ తేదీ నుంచి ప్రదర్శనకు ఉంచిన తరువాత పైకి నివేదికలను పంపించాం. ఒక రోజు మాత్రమే జాబితాలను ప్రదర్శించామనే దాంట్లో వాస్తవం లేదు. ఇప్పటికి కూడా జాబితాలు ఆర్ఎస్‌కేలలోనే ఉన్నాయి. ఏమైనా ఫిర్యాదులుంటే తెలియజేయవచ్చు. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లతాం.
>
> –నూరున్నీసా, ఇన్‌చార్జి ఏవో, పెడన

వీఆర్ఓల బదిలీ

మోపిదేవి: మండలంలో వీఆర్వోల బదిలీల వివరాలను తహసీల్దార్ శ్రీ విద్య బుధవారం తెలిపారు. నాగాయితిప్ప రెవెన్యూలో పనిచేస్తున్న ఎం.గోపాలకృష్ణప్రసాద్ చల్లపల్లి–1కు, కొక్కిలిగడ్డలో పనిచేస్తున్న నీల్‌కాంత్‌ను కోసూరువారిపాలెంకు, పెదకళ్లేపల్లి–1లో పనిచేస్తున్న జీ వెంకట రమణను నాగాయితిప్పకు, పెదకళ్లేపల్లి–2లో పనిచేసే జీ వేణుగోపాలరావును పెదకళ్లేపల్లి–1కు, వెంకటాపురం వీఆర్వోగా పనిచేస్తున్న కె.వరప్రసాద్‌ను కొక్కిలిగడ్డకు, కోసూరువారిపాలెం వీఆర్వోగా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరావును మెరకనపల్లికి, మాజేరు వీఆర్వోగా పనిచేసే ఓ నాగమల్లేశ్వరావును పెదప్రోలుకు, అవనిగడ్డ–3లో పనిచేస్తున్న వీఆర్వో పి.శివరామప్రసాద్‌ను పెదకళ్లేపల్లి–2కు, మోపిదేవి–2 వీఆర్వో సీహెచ్ఎస్ఎల్ఎస్ఆర్ మూర్తి పెడన మండలం పెనుమల్లికి బదిలీ అయ్యారు.

దేవస్థానంలో స్వచ్ఛతాహీ సేవ

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి దేవస్థానంలో స్వచ్ఛ తాహీ సేవ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు నేతృత్వంలో స్వయంగా చీపుర్లు పట్టి క్లా రశాలను శుభ్రం చేశారు.అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి

మచిలీపట్నంటౌన్: భారతీయ జన సంఘ వ్యవస్థాపక సభ్యుడు పండిట్ దీన్‌దయాళ్ జయంతిని బీజేపీ నాయకులు బుధవారం నిర్వహించారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రాము, రాష్ట్ర సభ్యుడు పంతం గజేంద్ర, ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, వైవీఆర్ పాండురంగారావు, తోట రంగనాథ్ పాల్గొన్నారు.

వరిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

ఘంటసాల కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ కుమార్


ఘంటసాలలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ కుమార్

గోగినేనిపాలెం(ఘంటసాల): వరి పంటలో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఘంటసాల కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ కుమార్ అన్నారు. మండలంలోని గోగినేనిపాలెం, పాపవినాశనం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంఏవో కె.మురళీ కృష్ణ ఆధ్వర్యంలో రైతులతో కలిసి అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం పాముపొడ, సుడిదోమ తెగుళ్లు ఎక్కువగా ఉన్నాయని, పాముపొడ నివారణకు హెగ్జా కొనాజోల్ మందును ఒక ఎకరానికి 400 మి.లీ చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. సుడిదోమ నివారణకు ఎసిపేట్ మందును 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. హార్టికల్చర్ అధికారిణి కీర్తి, ఎంపీటీసీ తాడికొండ చిన్నా, ఎస్‌డీఏ రాంబాబు, వీఆర్వోలు, వీఏఏ ఎం.లావణ్య, రైతులు కుంపటి చిట్టిబాబు, మునిపల్లి బుజ్జి, ఘట్టమనేని మారుతీ ప్రసాద్, కుంపటి సుబ్బారావు, ఇతర రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అసక్తి అవసరం

మెరకనపల్లి(మోపిదేవి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని ఏడీఏ జేఎస్ జయప్రద తెలిపారు. మండలంలోని పెదప్రోలు, కప్తానుపాలెం గ్రామాలలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిపైరులో ఆశించే చీడపురుగులు, తెగుళ్ల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని రైతులకు సూచనలు చేశారు. డ్రిప్ ఇరిగేషన్, యంత్ర పరికరాలు, సబ్సిడీపై అందించే ముదులపై చర్చించారు. వరిలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగు ఆశించినట్లు గుర్తించామని తెలిపారు. దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు ఎకరాకు లేదా క్లోరాంట్రసిలిప్రోల్ 60 మి.లీ ఎకరానికి పిచికారి చేయాలన్నారు. కంకినల్లి నివారణకు ప్రోఫెన్‌ఫాస్ 400 మిల్లీలీటర్లు ఎకరానికి లేదా ప్రోపర్ గైడ్ 400 మిల్లీలీటర్లు లేదా స్పైటరోమెసిఫిన్ 200 మిల్లీలీటర్లు, దోమ ఉధృతిని గమనించినపుడు ప్రోఫెనోఫాస్ మందును వాడరాదని వివరించారు. గ్రామ సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హెప్సిబారాణి, ఏఏవోలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోవాలి

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): మర్రిపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలోని వక్కపట్లవారిపాలెంలో బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి టి.శుభహారిక మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట, వరి విత్తనాలు అందించామన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా గోకులం షెడ్లు, పశు దాణారుణాలు, వ్యాధి నిరోధక టీకాలు, గర్భాధారణ ఇంజెక్షన్లు తదితర సేవలను రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులకు అందిస్తున్నామన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు సింహాద్రి జ్యోత్స్న, సాతులూరి సురేష్, పశుసంవర్ధక శాఖ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: ఈ ఖరీఫ్‌లో రైతులు అధికవర్షాల వల్ల పంట దెబ్బతిన్న పొలాల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటించి పంటను కాపాడుకోవచ్చని ఏవో జెన్నీ అన్నారు. బుధవారం మండలంలోని మునిపెడ, చినపాండ్రాక గ్రామాలలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు సాగులో పలు సూచనలు, సలహాలు అందించారు. తెగుళ్ల నివారణ తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.

చదువులతో పాటు క్రీడల్లోనూ సత్తాచాటండి


గూడూరులో పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు

గూడూరు: విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు కోరారు. మండల స్థాయి అండర్–14, 17 బాలుర, బాలికల జట్ల ఎంపికలు బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూలులో ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగబాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల కోసం కొంత సమయం కేటాయించాలని కోరారు. తద్వారా దేహధారుఢ్యంతో పాటుగా మానసికోల్లాసం కలుగుతుందన్నారు. పాఠశాల హెచ్ఎం డి.పుష్పలత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లింగం విజయ్‌కుమార్, హాకీ క్లబ్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ సలీమ్, నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి మురళీకృష్ణ, మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి మత్తి అరుణ, పీడీలు శ్రీనివాస్, రవి, మండలంలోని వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో అండర్–14,17 విభాగాలలో బాలుర, బాలికల క్రీడాకారుల ఎంపిక చేశారు. నియోజకవర్గ క్రీడాకారుల ఎంపిక ఈనెల 27న గూడూరులో నిర్వహించనున్నట్లు మురళీకృష్ణ తెలిపారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేసేలా చూడాలి


హౌసింగ్‌పై సమీక్షిస్తున్న ఎంపీడీవో సుబ్బారావు

ఘంటసాల: మన గౌరవం– మన ఇల్లు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. స్థానిక మండల పరిషత్‌తో గృహ నిర్మాణ శాఖపై అధికారులతో బుధవారం ఎంపీడీవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 457 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని, వారితో మాట్లాడి మార్చి ఐదో తేదీలోపు నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రోత్సహించాలన్నారు. ఈ నెల 28న సచివాలయాల్లో మన గౌరవం– మన ఇల్లు గ్రామ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 27న స్వర్ణాంధ్ర–2047 గ్రామ సభల్లో ప్రజల అభిప్రాయాలను నమోదు చేయాలని చెప్పారు. అనంతరం పింఛన్లు, ఉపాధి పనులు, పంటలపై సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ శాఖ డీఈ భానోజీరావు, సురేంద్ర, ఈఓపీఆర్డీ జి.కిశోర్, పీఆర్ ఏఈ జె.నాగేశ్వరరావు, ఏపీవో రాజ్ కుమార్, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు వైద్య పరీక్షలు


వైద్యశిబిరాన్ని ప్రారంభించిన తహసీల్దార్ హరనాథ్, వెంకటేశ్వరరావు తదితరులు

ఎదురుమొండి(నాగాయలంక): వరద ముంపు ప్రాంతాల బాధితులకు వైరల్ జ్వరాలు, ఇతర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కృష్ణా జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, నాగాయలంక సబ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎదురుమొండి ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రం ఆవరణలో మండల తహసీల్దార్ ఎం.హరనాథ్, గ్రామ సర్పంచి భర్త కన్నా వెంకటేశ్వరరావు (చిన్న), పీఏసీఎస్ అధ్యక్షుడు కన్నా రామ్మోహనరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సంస్థ జిల్లా చైర్మన్ డాక్టర్ టీఏస్ఎస్ బాలాజీ, స్టేట్ బ్రాంచ్ సభ్యుడు కొత్తగుండు రమేష్ పర్యవేక్షణలో 200 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. బొండాడ గ్రూప్స్ (హైదరాబాద్) అధినేత బొండాడ రాఘవేంద్రరావు ఇచ్చిన రూ.30 వేలతో ఉచితంగా మందులను సమకూర్చారు. రెడ్‌క్రాస్ నాగాయలంక సబ్ బ్రాంచి చైర్మన్ భోగాది శివవిష్ణువర్ధన్ చేస్తున్న సేవలను తహసీల్దార్ హరనాథ్ అభినందించారు. ఎముకల వైద్యనిపుణుడు డాక్టర్ సి.సాయిప్రసాద్, న్యూరాలజిస్ట్ బి.కిరణ్, టి.వీరేంద్రనాథ్ (జనరల్), గైనకాలజిస్ట్ పరసా వాణికుసుమ, ఆప్తమాలజి స్పెషలిస్ట్ పామర్తి ప్రవీణ్ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి భవిరి శంకరనాథ్, కోశాధికారి కె.రామ్‌బాలాజీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కృష్ణప్రసాద్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ హరికృష్ణ, చెన్ను వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక హైస్కూలు పదో తరగతి విద్యార్థులు రోగులకు సేవలందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

పెడన: పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్టీఆర్ ఆరోగ్య వైద్యసేవా నుంచి ప్రత్యేకంగా వైద్యులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, వైస్ చైర్మన్ ఎండీ ఖాజా ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన ఆదేశాల మేరకు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు డాక్టర్ పి.ప్రశాంత్ (ఆర్థో), డాక్టర్ ప్రియాంక , డాక్టర్ డీవీఎస్ జగన్నాథరాజు(ఎండీ జనరల్ మెడిసిన్), డాక్టర్ కవిత ప్రియాంక (కార్డియాలజిస్ట్) తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు.

20 మందికి కంటి పరీక్షలు

మచిలీపట్నంటౌన్: రిటైర్డ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సంఘ భవనంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన గౌతమి నేత్రాలయ ఆప్తమాలజిస్ట్ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. 20 మందికి పరీక్షలు చేసి ఐదుగురికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. ప్రతి నెలా రెండు, నాల్గవ బుధవారాల్లో నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తామని కారుమూరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. సంఘ కోశాధికారి శంకరరావు, బీకే దుర్గారావు, ఎం. సత్యనారాయణ, గౌతమి నేత్రాలయం ప్రోగ్రాం మేనేజర్ ఎస్.గోపీ తదితరులు పాల్గొన్నారు.

కూటమికి వ్యతిరేకంగా పోస్టు పెడితే ఫోన్ సీజ్

అత్యుత్సాహం చూపుతున్న పెడన పోలీసులు

పెడన: ఎన్డీయే కూటమిలోని నాయకులకు వ్యతిరేక పోస్టులను వైఎస్సార్ సీపీ సానుభూతి పరులు, కార్యకర్తలు, అభిమానులు ఎవరైనా ఫార్వర్డ్ చేస్తే ఇక అంతే. స్థానికంగా ఉండే ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పెడన పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి ఫలానా వ్యక్తి ఫోన్‌లోని వాట్సప్ గ్రూపుల ద్వారా పోస్టులు పెడుతున్నాడని, మీరు చర్యలు తీసుకోవాలని చెబితే చాలు.. పెడన పోలీసులు అత్యుత్సాహం చూపుతున్నారు. ఎటువంటి కేసులు లేకపోయినా ఫార్వార్డ్ చేసిన వ్యక్తి నుంచి ఫోన్‌ను లాక్కొంటున్నారు. ఫోన్‌లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారు. అదేమంటే పోస్టు పెట్టినందుకు పనిష్మెంట్ అంటున్నారని పలువురు బాధితులు వాపోతున్నారు. పెడన పోలీసులు మరీ ఇంత స్వామి భక్తి చాటుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేధింపులకు గురిచేస్తూ ఫోన్‌లను లాక్కోవడం ఏమిటంటూ బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు నాలుగైదు ఫోన్లు లాక్కున్నట్టు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ ఫోన్లను తమకు ఇప్పించాలని వేడుకుంటున్నారు.

ప్రకటన

[illegible]

మచిలీపట్నం, 24.09.2024

[illegible]

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

నాగాయలంక: స్థానిక హైస్కూల్ గ్రౌండ్స్‌లో 23, 24 తేదీల్లో 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలలో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ బాలబాలికలు విజయదుందుభి మోగించారు. వివరాలను స్థానిక జెడ్పీహెచ్ఎస్ పీడీ గాజుల లక్ష్మీప్రసాద్ బుధవారం తెలిపారు. అండర్–17 బాలికలు, బాలుర విభాగంలో 12 మంది, అండర్–17 బాలుర కబడ్డీలో నలుగురు, బాలికల కబడ్డీ ముగ్గురు, అండర్–14 కబడ్డీ బాల, బాలికలు 12 మంది నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్–17 బాలికల 100 మీటర్ల పరుగు పందెంలో నాయుడు జ్యోతి, ఎం.దివ్య ప్రథమ, ద్వితీస్థానాలు సాధించారు. 200 మీటర్ల పరుగు పందెంలో జ్యోతి ప్రథమ, దివ్య ద్వితీయ స్థానంలో నిలిచారు. 400 మీటర్లలో బి.శ్రావణి, కొక్కిలిగడ్డ విన్ని షాట్‌పుట్‌లో సబ్బినేని పూజ, లాంగ్ జంప్‌లో ఎన్.దివ్య ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలంతా నియోజకవర్గ స్థాయి పోటీలకు హాజరవుతారు. మండల స్థాయిలో విజేతలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ హెచ్.ఎం పీఎన్‌వీఎస్ ప్రసాద్, స్టాఫ్ అభినందించారు.

ఉత్సాహంగా సామూహిక సీమంతాలు

చిలకలపూడి(మచిలీపట్నం): మండల పరిధిలోని ఎస్ఎన్ గొల్లపాలెంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. మచిలీపట్నం సెక్టార్ సూపర్‌వైజర్ జి.విజయకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు రక్తహీనత లేకుండా చేసేందుకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామన్నారు. చిన్నారులకు తీసుకోవాల్సిన పోషకాహార పదార్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కొండేటి సుబ్రహ్మణ్యం, కొనకళ్ల మధు, ఎంఎస్‌కే అనుపమ పాల్గొన్నారు.

వాడీవేడిగా గూడూరు మండల సమావేశం


సమావేశంలో సభ్యుల సమస్యలు వింటున్న ఎంపీపీ, తదితరులు

గూడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాల్లో ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం ఇవ్వడం లేదంటూ మల్లవోలు ఎంపీటీసీ సభ్యులు పిట్ల రామిరెడ్డి, మెట్ల లక్ష్మీకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలోని జెడ్పీ హైస్కూలులో రూ.2 లక్షలతో షెడ్ నిర్మాణం చేపట్టినా తమకు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. తరకటూరులో సచివాలయాన్ని టీడీపీ నాయకుడి ఇంట్లో మార్చడానికి ప్రభుత్వ ఉత్తర్వులు లేవంటూ అధికారుల తీరును ఎండగట్టారు. పంచాయతీలోకి మార్చాలని డిమాండ్ చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో నైట్‌వాచ్‌మెన్‌ను అకారణంగా తొలగించారంటూ మండిపడ్డారు. కలపటం సర్పంచి ఐనాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ముక్కొల్లు గ్రామానికి రేషన్ ప్రతినెలా మొదటి రోజునే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మచిలీపట్నం నుంచి పెడన– ఆకులమన్నాడు–గూడూరు మీదుగా విజయవాడకు ఆర్టీసీ బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ఆకులమన్నాడు సర్పంచి ఎం.డి.రఫీ అధికారులను కోరారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు మాట్లాడుతూ లేవనెత్తిన సమస్యల పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, వైస్ ఎంపీపీలు నేతల కుటుంబరావు, పిచ్చుక గంగాధరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.రాజేశ్వరి, తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.